క్లుప్తంగా

కాశీ యాత్రకు బయలుదేరిన భక్తులు



యాత్రకు బయలుదేరుతున్న భక్తులు

పాయకరావుపేట : మండలంలో గల పాల్తేరు, అంకంపేట గ్రామంలో పలువురు భక్తులు కాశీ యాత్రకు పయనమయ్యారు. దేవవరపు లోవరాజు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గ్రామంలో 50 మంది భక్తులు కాశీ యాత్రకు బయలుదేరారు. లోవరాజు కుమారులు వీరందరినీ విశాఖపట్నం వరకు బస్సులో పంపించి, అక్కడి నుండి రైలు ప్రయాణం ద్వారా కాశీకి తీసుకెళ్తున్నట్టు తెలిపారు. తుని తపోవనం పీఠాధిపతి శ్రీ సచ్చిదానంద సరస్వతీ స్వామీజీ ఈ యాత్రను ప్రారంభించారు. లోవరాజు కుమారులు దేవవరపు రాంబాబు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసే యాత్రా కార్యక్రమంలో దేవవరపు వెంకటేశ్వరరావు, విశ్వనాథుని బద్రీనాథ్, దేవవరపు బుజ్జి, విశ్వనాథుని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఘనంగా రాఖీ పండగ

రాంబిల్లి : మండలంలో పలు గ్రామాల్లో బుధవారం రాఖీ పండగను ఘనంగా జరుపుకొన్నారు. అక్కలు, చెల్లెళ్లు తమ తమ అన్నదమ్ములకు రాఖీలు కట్టి నాకు నువ్వు రక్ష.. నేను నీకు రక్ష అంటూ సోదర భావాన్ని చాటుకున్నారు. అయితే ఈ ఏడాది రాఖీ పండగ విషయంలో సందిగ్ధం నెలకొంది. కొంతమంది బుధవారం రాఖీ పండగను జరుపుకోగా మరికొందరు గురువారం జరుపుకోనున్నారు.

4న వైస్ ఎంపీపీ ఎన్నిక

ఎస్.రాయవరం : మండలంలో వైస్ ఎంపీపీ ఎన్నిక సెప్టెంబర్ 4న నిర్వహించనున్నట్టు ఎంపీడీవో రామచంద్రమూర్తి బుధవారం తెలిపారు. మండలంలో ఇటీవల వైస్ ఎంపీపీగా ఉన్న కోన లోవలక్ష్మి ఎంపీపీగా ఎన్నిక కావడంతో ప్రభుత్వం అదనం ఇచ్చిన వైస్ ఎంపీపీ పదవి ఖాళీ ఏర్పడింది. ఈ మేరకు వైస్ ఎంపీపీ పదవి ఎన్నిక నిర్వహిస్తున్నట్టు చెప్పారు.

నాగులాపల్లి పీఏసీఎస్ మహాజన సభ నేడు

మునగపాక : మండలంలోని నాగులాపల్లి పీఏసీఎస్ మహాజన సభ ఈనెల 31న జరుగుతుందని సంఘ సీఈవో మళ్ల స్వామి ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు సంఘ ఆవరణలో జరిగే మహాజన సభకు అధ్యక్షుడు మళ్ల ఉమామహేశ్వరరావు అధ్యక్షత వహిస్తారన్నారు. సంఘ పరిధిలోని రైతులు మహాజన సభను జయప్రదం చేయాలని స్వామి కోరుతున్నారు.

శరవేగంగా మదుం పనులు

ఎస్.రాయవరం : కర్రివానిపాలెం గ్రామంలో రైతుల పొలాలకు వెళ్లే దారి కోసం కాలువపై నిర్మాణం చేస్తున్న మదుం పనులు శరవేగంగా జరుగుతున్నాయి. గ్రామంలో గడపగడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే గొల్ల బాబూరావుకు రైతులు ,వ్యవసాయ కూలీలు సమస్య చెప్పడంతో సుమారు రూ. 10 లక్షలు కేటాయించారు. ఈ మేరకు ఇరిగేషన్ అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టి నిర్మాణం పూర్తి చేస్తున్నట్టు ఏఈ చిన్నారావు తెలిపారు.

పెరిగిన ఎండ తీవ్రత

రాంబిల్లి: మండలంలో బుధవారం ఎండ తీవ్రత ఎక్కువైంది. భానుడు భగభగలతో రైతులు, కూలీలు ఇబ్బందులు పడ్డారు. వేసవిని తలపిస్తూ ఎండ ప్రభావం చూపడంతో ప్రజలు అవస్థలు పడ్డారు. వరినాట్లు పనుల్లో వున్న రైతులు, కూలీలు ఎండ దెబ్బకు విలవిలలాడారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్సీ రాజు జన్మదిన వేడుక



కైలాసపట్నంలో కేక్ కట్ చేస్తున్న మాజీ సర్పంచ్ నాగేశ్వరరావు

కోటవురట్ల: మండలంలో మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. కైలాసపట్నంలో మాజీ సర్పంచ్ సిద్దాబత్తుల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి వేడుక జరిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ శానాపతి రమణ, మాజీ జెడ్పీటీసీ వి.వెంకటలక్ష్మి, పార్టీ నాయకులు ఎం.నానాజీ, ఎ.వరహాలు, సురేష్, పి.రాంబాబు పాల్గొన్నారు.

కోతకొచ్చిన బెండ...నవనవలాడే వంగ

- మండలంలో విస్తృతంగా కూరగాయల సాగు
- ఏడాది పొడవునా దిగుబడులు
- రైతుకు లాభదాయకం



సాగవుతున్న వంగతోట



కోతకు వచ్చిన పంట

కోటవురట్ల : మండలంలోని రైతులు కూరగాయల సాగుపై మక్కువ చూపిస్తున్నారు. కూరగాయలు నిత్యం అమ్మకాలు ఉండడంతో ఆదాయం బాగుంటుందన్న భావన రైతుల్లో కనిపిస్తోంది. మండలంలోని జల్లూరు, యండపల్లి, లింగాపురం, బి.కె.పల్లి, అన్నవరం, చినబొడ్డేపల్లి, రామన్నపాలెం, పాములవాక, పి.కె.పల్లి, ఆక్సాహేబుపేట తదితర గ్రామాల్లో కూరగాయల సాగు ఎక్కువగా ఉంది. ప్రధానంగా జల్లూరు, లింగాపురం గ్రామాల్లో పలువురు రైతులు ఏడాది పొడవునా కూరగాయలను సాగు చేస్తున్నారు. తక్కువ పెట్టుబడితో తక్కువ కాలంలోనే అధికాదాయాన్ని పొందుతున్నారు. మండలంలో సుమారు 80 ఎకరాల్లో కూరగాయల సాగు జరుగుతోంది. వంగ, బెండ, బీర, దొండ, చిక్కుడు, టమాటా, పచ్చిమిర్చి, ఆకుకూరలు ఎక్కువగా పండిస్తున్నారు.

సాగు ఇలా..

విత్తు నాటిన మూడు నెలల కాలంలోనే ఫలసాయం వస్తుంది. విత్తు నాటాక సకాలంలో నీటి తడులు పెట్టడం ద్వారా తొందరగా మొక్క ఎదుగుదల సాధ్యపడుతుంది. తెగుళ్లు సోకకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలి. పంటను పరిశీలిస్తూ ఎక్కడైనా తెగుళ్లు కనిపిస్తే వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలి. ఎకరా పరిధిలో సాగుకు విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చు కలిపి సుమారు రూ.10 వేలు వరకు ఖర్చు కాగా ఫలసాయంతో సుమారు రూ.40 వేలు వరకు ఆదాయం వస్తుంది.

దళారుల బెడద లేకుండా..

గతంలో రైతులు దళారుల కారణంగా ఎక్కువగా నష్టపోయేవారు. ఇపుడు రైతు బజారులు రైతుల కష్టానికి తగిన ప్రతిఫలాన్ని ఇస్తుండగా ఎక్కువ ఆదాయాన్ని పొందుతున్నారు. కాలంతో పాటు పరుగెడుతున్న రైతులు ఇపుడు నేరుగా వారే విక్రయాలు నిర్వహిస్తున్నారు. ఇందుకు వారపు సంతలు ఎంతగానో ఉపయోగపడుతున్నాయి. అంతే కాకుండా ప్రధాన రహదారుల వెంబడి తాజాగా కోసుకొచ్చిన కూరగాయలను వాటాలుగా వుంచి విక్రయిస్తున్నారు. తాజా కూరగాయలు దొరుకుతుండడంతో ఎక్కువగా డిమాండ్ ఉంటోంది. దీని వల్ల రైతుకు సరకు విక్రయాలకు ఎక్కువ దూరం ప్రయాణించాల్సిన అవసరం లేదు. ఆశీల బెడద లేదు. దళారుల గొడవ అసలే లేదు. నేరుగా లాభాలన్నీ రైతుకే దక్కుతున్నాయి.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం

రైతులకు ప్రభుత్వం అండగా ఉంటోంది. వివిధ పంటలపై రైతులకు తరచూ అవగాహన కల్పిస్తున్నాం. జల్లూరు, లింగాపురం, ప్రాంతాలలో ఎక్కువగా కూరగాయలను సాగు చేస్తున్నారు. ప్రస్తుతం ఖరీఫ్‌లో వరి నాట్లు జరుగుతున్నప్పటికీ చాలా మంది రైతులు ఏడాది పొడవునా కూరగాయలను సాగుచేస్తున్నారు. వారికి మార్కెటింగ్ ఇబ్బంది లేదు. రైతులే నేరుగా దుకాణాలు పెట్టి విక్రయాలు జరపడంతో తగిన ప్రతిఫలం దక్కుతోంది.

– సరోజిని, ఏవో, కోటవురట్ల

సంక్షేమ పథకాలే శ్రీరామరక్ష



మెలిపాక వార్డు సభ్యునిగా ఎన్నికైన సత్యనారాయణను సత్కరిస్తున్న దృశ్యం

మునగపాక : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలే శ్రీరామ రక్షగా నిలుస్తాయని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. మండలంలోని మెలిపాక పంచాయతీ వార్డు సభ్యునిగా వైఎస్సార్‌సీపీ మద్దతుతో విజయం సాధించిన గుల్ల అమర వెంకట సత్యనారాయణను బుధవారం పార్టీ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇటీవల నిర్వహించిన పంచాయతీల ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు పెద్దసంఖ్యలో విజయం సాధించిన విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలకు ప్రజలంతా ఆకర్షితులవుతున్నారన్నారు. ప్రజలతో మమేకం అవుతూ వారి సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలన్నారు. ఎన్నికలు ఎపుడూ జరిగినా వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చి జగన్‌మోహన్ రెడ్డి మళ్లీ సీఎం కావడం కూడా తథ్యమని అన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ చిందాడ దేవి, మాజీ వైస్ ఎంపీపీ దొడ్డి వరహాతో పాటు పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్లకు నియామక పత్రాలు



వలంటీర్లకు నియామక పత్రాలు అందిస్తున్న జెడ్పీటీసీ లంక సూరిబాబు

పాయకరావుపేట : పట్టణంలో గల 5వ సచివాలయ పరిధిలో గల ఇద్దరు గ్రామ వలంటీర్లకు కొత్తగా నియామక పత్రాలు అందించడం జరిగిందని ఎంపీడీవో ఎ.సాంబశివరావు తెలిపారు. 5వ నంబరు గ్రామ సచివాలయంలో రెండు వలంటీర్ పోస్టులకు ఖాళీ ఏర్పడగా వాటికి ఇంటర్వ్యూలు నిర్వహించడం జరిగిందన్నారు. ఇద్దరినీ ఎంపిక చేసి జెడ్పీటీసీ లంక సూరిబాబు చేతుల మీదుగా వలంటీర్లకు నియామక పత్రాలు అందించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో డీటీ కె.నూకరాజు, ఈవోఆర్‌డీ వై.వి. సత్యనారాయణ, గ్రామ కార్యదర్శి జె.చంద్రశేఖర్ ఉన్నారు.

చట్టాలపై అవగాహన అవసరం



మాట్లాడుతున్న అరబుపాలెం పంచాయతీ కార్యదర్శి రమణ

మునగపాక : అరబుపాలెం దళితవాడలో బుధవారం సాయంత్రం పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఎంపీడీవో మన్మథరావు, ఇన్‌చార్జి తహసీల్దార్ వినయ్, ఎస్ఐ మహమ్మద్ అలీ, సాంఘిక సంక్షేమ అధికారి ఏసుదాసు కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి రమణ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ చట్టాలపై అవగాహన పెంచుకోవాలని, కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సోదరభావంతో మెలగాలని అన్నారు. ఈ సందర్భంగా కాలనీవాసులు శ్మశాన వాటికను వేరే చోటకు తరలించేలా చూడాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎంపీడీవో మన్మథరావు సమస్యను ఆర్‌డీవో చిన్నికృష్ణ దృష్టికి తీసుకువెళతామన్నారు. సర్పంచ్ బొడ్డేడ శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ లంబా అప్పారావు, డీవీఎంసీ సభ్యులు రేబాక మధుబాబు, పీఏసీ చైర్మన్ నెల్లుముఖి మహేష్ పాల్గొన్నారు.

కుటీర పరిశ్రమలతో మహిళలకు జీవనోపాధి



స్వయం సహాయక సంఘాల మహిళల సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ వీరయ్య

యలమంచిలి : కుటీర పరిశ్రమలతో మహిళలు ఆర్థికంగా ప్రగతి సాధించాలని మున్సిపల్ కమిషనర్ కె.వీరయ్య అన్నారు. బుధవారం యలమంచిలి పట్టణంలో స్వయం సహాయక సంఘాల సమావేశంలో ముఖ్య అతిథిగా మాట్లాడారు.

స్వయం సహాయక సంఘాల ద్వారా మహిళలకు రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై రుణాలు మంజూరు చేస్తుందని, ప్రతి సంఘం సభ్యులు ఒక యూనిట్‌గా ఏర్పడి కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకోని జీవనోపాధి పొందాలని అన్నారు. బ్యాంకుల నుంచి పొందిన రుణాలు సద్వినియోగం చేసుకుని ఉమ్మడి వ్యాపారాభివృద్ధితో ఆర్థిక ప్రగతి సాధించవచ్చునని తెలిపారు. పేపర్ ప్లేట్స్ తయారీ, శానిటరీ నాప్‌కిన్స్, పేపర్ కవర్స్, అగర్‌బత్తీల తయారీ వంటి యూనిట్లు ఇంటి వద్దనే ఏర్పాటు చేసుకుని జీవనోపాధి పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బెజవాడ నాగేశ్వరావు, కౌన్సిలర్ కొఠారు నాగమణి, మెప్మా ఎం.పద్మావతి, సిబ్బంది సందీప్, వరలక్ష్మి, సత్య, కృష్ణవేణి పాల్గొన్నారు.

ఓర్వలేకే తప్పుడు ప్రచారాలు



విలేకరులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు స్వామి సత్యనారాయణ

మునగపాక : ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజల్లో రోజురోజుకు పెరుగుతున్న ఆదరణ చూసి ఓర్వలేని ప్రతిపక్ష పార్టీలు, మీడియా సంస్థలు తప్పుడు ప్రచారం చేయడం బాధాకరమని జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఆందోళన చేసినట్టు కొంతమంది తప్పుడు ప్రచారం చేయడాన్ని బుధవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖండించారు. మండల సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యలపై అధికారులు స్పందించాలని కోరితే కొంతమంది తప్పుడు కథనాలు రాయడం సమంజసం కాదన్నారు. మునగపాక ఎంపీటీసీ సభ్యుడు సూరిశెట్టి రాము మాట్లాడుతూ అన్ని వర్గాల నుంచి ప్రభుత్వానికి వస్తున్న ఆదరణ చూసి ఓర్వలేక కొన్ని పత్రికలు వక్రీకరిస్తున్నాయని అన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన వలంటీర్, సచివాలయ వ్యవస్థలు మంచి ఫలితాలు ఇస్తున్నాయని వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు పేర్కొన్నారు. ఇప్పటికైనా ప్రతిపక్ష పార్టీలు, కొన్ని మీడియా సంస్థలు ప్రభుత్వంపై బురదజల్లే కార్యక్రమాలకు స్వస్తి పలకాలని లేకుంటే తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు. సమావేశంలో వైస్ ఎంపీపీ చిందాడ దేవి, సర్పంచ్‌లు దిమ్మల అప్పారావు,బొడ్డేడ శ్రీను,సూరిశెట్టి గంగయమ్మ(ఎస్ఆర్),భీశెట్టి గంగప్పలనాయుడు,ఎంపీటీసీలు మద్దాల వీరునాయుడు,బోడకుర్తి గణేష్ ,మళ్ల కాశీ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రామన్నపాలెంలో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



రోడ్డు పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): మండలంలోని రామన్నపాలెంలో మండల పరిషత్ నిధులతో చేపడుతున్న సీసీ రోడ్ నిర్మాణ పనులను ఎంపీపీ భర్త కోన బుజ్జి, ఎంపీటీసీ లాలం శ్రీను, కో ఆప్షన్ జెడ్పీ సభ్యుడు లాలం శ్రీనులు కొబ్బరికాయ కొట్టి బుధవారం ప్రారంభించారు. సర్పంచ్ డ్రీమ్స్ నాయుడు, సచివాలయ కన్వీనర్ నాయుడు బాబు, సుబ్రమణ్యం, సత్యనారాయణ, సతీష్ పాల్గొన్నారు.

బంగారమ్మపాలెంలో డ్రైనేజీ పనులు ప్రారంభం



బంగారమ్మపాలెంలో డ్రైనేజీ పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని చీమలాపల్లి శివారు బంగారమ్మ పాలెంలో డ్రైనేజీ పనులను సర్పంచ్ సియాద్రి బుజ్జి, ఎంపీటీసీ నగిరెడ్డి నాగేశ్వరరావు బుధవారం ప్రారంభించారు. మాజీ ఎంపీటీసీ జాగారపు అప్పలనాయుడు, మజ్జి రమణ, గండి సన్యాసిరావు, జాగారపు రాంబాబు పాల్గొన్నారు.

దస్తావేజు లేఖరులకు అవకాశం కల్పించాలి

నక్కపల్లి/సబ్బవరం: రాష్ట్ర ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా తీసుకువచ్చిన కార్డు ప్రైమ్ 2.0 ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానానికి తాము వ్యతిరేకం కాదని.. దీంతో పాటు దస్తావేజు లేఖరులకు డాక్యుమెంటు రాసుకునే అవకాశం కల్పించాలని మండలంలోని దస్తావేజు లేఖరులు కోరారు. ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానాన్ని వ్యతిరేకిస్తూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖరులు బుధవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నూతన విధానాన్ని తామంతా ప్రోత్సహిస్తామని, తాము రోడ్డున పడకుండా చూడాలని కోరారు.

మార్కెట్‌లో రాఖీ సందడి



నెహ్రూచౌక్‌లో రాఖీ దుకాణం వద్ద మహిళల సందడి

అనకాపల్లిటౌన్: అన్నయ్యను మించిన ధైర్యం, అక్కచెల్లెళ్లను మించిన ఆత్మీయులు ఉండరేమో. అందుకే రక్షాబంధన్ వేడుక వస్తోందంటే అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల కళ్లల్లో అంతులేని ఆనందం. ఆ సందడి బుధవారం పట్టణంలోని దుకాణాల వద్ద కొట్టొచ్చినట్లు కనిపించింది. మహిళలు, చిన్నారులు పలు ఆకృతుల్లో ఉన్న రాఖీలను తిలకిస్తూ తమకు నచ్చిన వాటిని కొనుగోలు చేశారు. నెహ్రూచౌక్‌లో రాఖీ దుకాణాలను ప్రత్యేకంగా తెరిచారు. స్థానికంగా ఉన్న పలు కూడళ్లలో ఆకర్షించేలా రాఖీ దుకాణాలు వెలిశాయి. దీంతో పట్టణంలో రాఖీ పండగ సందడి నెలకొంది.

వంతెనకు మరమ్మతులు చేయాలని వినతి

పరవాడ: మండలంలోని వాడచీపురుపల్లి–ముత్యాలమ్మపాలెం రహదారిలో ముత్యమాంబ ఆలయం వద్ద వంతెన రక్షణగోడ లేక పోవడంతో ప్రజలు భయపడుతున్నారు. 50 ఏళ్ల కిందట నిర్మించిన వంతెన కాస్త దెబ్బతింది. రక్షణ గోడలు కూలిపోయాయి. దీంతో రాత్రి వేళ అదుపుతప్పి వంతెనపై నుంచి పడిపోతున్నారు. ఆర్‌అండ్‌బీ అధికారులు స్పందించి ప్రమాదాలకు కారణమవుతున్న వంతెనను తొలగించి, రోడ్డుతో సమానంగా వంతెనను ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు.

ఎన్‌సీసీ క్యాడెట్లకు బోట్ పుల్లింగ్ పోటీలు



ఐఎన్ఎస్ సర్కిల్‌లో బోట్ పుల్లింగ్ పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

అచ్యుతాపురం(అనకాపల్లి): మండలంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎన్‌సీసీ ఇంటర్ గ్రూప్ కాంపిటీషన్స్‌లో భాగంగా బోట్ పుల్లింగ్ పోటీలు బుధవారం నిర్వహించారు. క్యాంప్ కమాండెంట్ కమాండర్ ఇంగ్లీషర్ పర్యవేక్షణలో ఐఎన్ఎస్ సర్కిల్ పరిధిలో నిర్వహించారు. ఫైరింగ్, షిప్ బిల్డింగ్ పోటీలు నిర్వహించనున్నారు.

పూడిమడక, తంతడిలో సీపీఎం సమరభేరి

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని పూడిమడక, తంతడి గ్రామాల్లో సీపీఎం సమరభేరి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటా ప్రచారం నిర్వహించారు. సీపీఎం మండల కన్వీనర్ ఆర్.రాము, చోడపల్లి అప్పారావు, కూండ్రపు సోమునాయుడు, చేపల తాతయ్య, కృష్ణ,గనగళ్ల నూకరాజు, దొడ్డమ్మ పాల్గొన్నారు.

మరిడిమాంబ జాతర నేడు



మరిడిమాంబ అమ్మవారు

- అమ్మవారికి ప్రత్యేక పూజలు, సాంస్కృతిక కార్యక్రమాలు

అనకాపల్లిటౌన్: నమ్మి కొలిచిన వారి కొంగు బంగారం కోట్నివీధి మరిడిమాంబ అమ్మవారి జాతర గురువారం ఘనంగా నిర్వహించనున్నారు. ఈ మేరకు ఆలయ కమిటీ సభ్యులు, కోరుకొండ రాఘవ మిత్ర మండలి బృందం ఏర్పాట్లు పూర్తి చేశారు. తెల్లవారుజామున 4 గంటలకు శ్రీసత్యసాయిభజన మండలి వారిచే అమ్మవారి మేలుకొలుపు సేవ, అనంతరం అమ్మవారికి అభిషేకాలు, ప్రత్యేక కుంకుమార్చనలు జరగనున్నాయి. మేళతాళాల నడుమ అమ్మవారి ఊరేగింపు నిర్వహించనున్నారు. నవదుర్గ పీఠం వారిచే పూల అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమీయనున్నారు. భక్తులు పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించాల్సిందిగా కమిటీ సభ్యులు కోరారు.

సాంస్కృతిక కార్యక్రమాలివే.. : అమ్మవారి జాతర సందర్భంగా మధ్యాహ్నం 3 గంటలకు నేలడ్యాన్స్‌లు, సాయంత్రం 4 గంటలకు ఏలి ఏనుగు ఊరేగింపు, రాత్రి 7 గంటలకు కోరుకొండ రాఘవ మిత్ర మండలి సహకారంతో మా నమ్మకం నువ్వే జగన్, బాడీబిల్డింగ్ షో, జై చంద్రన్న డ్యాన్స్, కోలాటం, తప్పెటగుళ్లు, చిన్నారుల కోలాటం, తోడపెద్దు సేవ, నెమలి, తీన్‌మార్, డీజే, రెయిన్‌డ్యాన్స్‌లు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు జాతరలో ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి.

వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడాలి



ప్రేమ సమాజంలో నిత్యావసర సరకులు, పండ్లు అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



సుకుమారవర్మకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్.చిత్రంలో వాడ్రాపల్లి సర్పంచ్ నూకరాజు

- పార్టీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్ పిలుపు
- ఘనంగా డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ జన్మదిన వేడుకలు

మునగపాక : యలమంచిలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండా రెపరెపలాడాలని ఇందుకు ప్రతి ఒక్కరూ కష్టపడి పనిచేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. డీసీసీబీ మాజీ చైర్మన్ యు.సుకుమారవర్మ జన్మదిన వేడుకలను బుధవారం పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. సుకుమారవర్మ జన్మదిన కేక్‌ను ప్రసాద్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి సుకుమారవర్మ కృషి చేస్తున్నారన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, వైస్ ఎంపీపీ చిందాడ దేవి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కనకలక్ష్మి అప్పారావు, సర్పంచ్‌లు నూకరాజు, అప్పారావు, బొడ్డేడ శ్రీనివాసరావు, ఎంపీటీసీలు రాము, వీరునాయుడు, గణేష్, బొడ్డేడ బుజ్జి, పార్టీ అధికార ప్రతినిధి ఆడారి కాశిబాబు పాల్గొన్నారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ జన్మదిన వేడుకల్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. అచ్యుతాపురంలోని ఇంటిగ్రేటెడ్ దివ్యాంగుల వసతి గృహంలోని పిల్లల మధ్య కేక్ కట్ చేసి, విద్యార్థులకు భోజనాలు పెట్టారు. వసతి గృహం నిర్వాహకులు పట్నాయక్, జెడ్పీటీసీ లాలం రాంబాబు, ఎంపీపీ భర్త కోన బుజ్జి, జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్ పాల్గొన్నారు.

యలమంచిలి : డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార్ వర్మతేజ జన్మదిన వేడుకలు బుధవారం యలమంచిలి వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు, పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు యర్రయ్యదొర, ఎంపీపీ బోదెపు గోవింద్ ఆధ్వర్యంలో భారీ కేక్ కట్ చేసి పంచారు. కొక్కిరాపల్లి ప్రేమ సమాజంలో వృద్ధులకు పండ్లు, నిత్యవసర సరుకులు అందజేశారు. మున్సిపల్ వైస్ చైర్మన్‌లు నాగేశ్వరావు, అత్రెపు గుప్తా, ఏటికొప్పాక వైఎస్సార్‌సీపీ నాయకుడు రాము, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షురాలు మహాలక్ష్మి, కొక్కిరాపల్లి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జ్ మళ్ల కొండబాబు, కో ఆప్షన్ సభ్యురాలు షేక్ సయ్యిద్ బీబి, కౌన్సిలర్లుకొండబాబు, దాసరి కుమార్, రమణ పాల్గొన్నారు.

రాంబిల్లి: సుకుమారవర్మ జన్మదిన వేడుకలను రాంబిల్లిలో బుధవారం వైఎస్సార్‌సీపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, జెడ్పీటీసీ ధూళి నాగరాజు తదితరులు కేక్ కట్ చేశారు.

వాడ్రాపల్లి అభివృద్ధికి సహకారం



ఆటల పోటీల విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రముఖ వైద్య నిపుణుడు సతీష్‌కుమార్

మునగపాక : వాడ్రాపల్లి గ్రామాభివృద్ధికి తనవంతు సహకారాన్ని అందజేస్తానని ప్రముఖ వైద్య నిపుణుడు డాక్టర్ పెతకంశెట్టి సతీష్‌కుమార్ పేర్కొన్నారు. వాడ్రాపల్లిలో జోగినాయుడు గ్రంథాలయం వార్షికోత్సవంలో భాగంగా నిర్వహించిన పలు ఆటల పోటీల్లో విజేతలకు మంగళవారం రాత్రి ఆయన బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యార్థులు లక్ష్యం కోసం చదువుకుంటే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందన్నారు. గ్రంథాలయ గౌరవ అధ్యక్షుడు పెతకంశెట్టి రామజోగినాయుడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, మొల్లేటి కోటేశ్వరరావు, సాయి, బొడ్డేడ సత్యనారాయణ, మళ్ల వరహా నరసింగరావు పాల్గొన్నారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కూడా బహుమతులు అందజేశారు.

మైహోమ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న కార్మికులు, కర్మాగారం ప్రతినిధులు

యలమంచిలి : మండలంలో ములకలాపల్లి మైహోమ్ కర్మాగారం స్థాపించి 16 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా బుధవారం స్థానిక కర్మాగారంలో అనకాపల్లి ఎన్‌టీఆర్ బ్లడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ శిబిరంలో 78 మంది కంపెనీ కార్మికులు, ప్రతినిధులు రక్తదానం చేశారు. కంపెనీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ విహెచ్ చౌదరి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని, రక్తదానం వల్ల ఒకరి ప్రాణాలు కాపాడిన వారవుతారని అన్నారు. కార్యక్రమంలో జీఎం బి.శ్రీరామస్వామి, సీనియర్ జీఎం ఎల్. శ్రీనివాసరావు, ఒహెచ్‌సి ఇన్‌చార్జి రాజు, కంపెనీ ఉద్యోగులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.